క్లుప్తంగా

సైబర్ మోసాలపై అప్రమత్తత అవసరం



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న సీఐ సుబ్బారావు

చీమకుర్తి రూరల్: సైబర్ మోసాలపై అప్రమత్తత అవసరమని చీమకుర్తి సీఐ సుబ్బారావు సూచించారు. మండలంలో పల్లామల్లి గ్రామంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను బుధవారం ఆయన సందర్శించారు. విద్యార్థులతో మాట్లాడుతూ సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకుని అమాయక ప్రజలను సైబర్ నేరగాళ్లు మోసం చేస్తున్నారని, అప్రమత్తంగా ఉండాలని సూచించారు. సైబర్ నేరాలు, ట్రాఫిక్ నిబంధనలు, మహిళలపై జరుగుతున్న నేరాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

200 మందికి అన్నదానం



అన్నదానం చేస్తున్న సేవా సంకల్ప ట్రస్ట్ సభ్యులు

సంతనూతలపాడు: మండల కేంద్రంలోని ఓ ప్రైవేటు గూడేంలో సేవా సంకల్ప చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో బుధవారం పేదలకు 26వ వారం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఎన్నారై నాయుడు కౌముది పుట్టినరోజు సందర్భంగా 200 మందికి అన్నదానం చేశారు. ఏఎస్ఐ జి.వెంకట్రావు ప్రారంభించగా, ట్రస్ట్ వైస్ చైర్మన్ పావులూరి నారాయణస్వామి చౌదరి, ట్రస్ట్ గౌరవాధ్యక్షురాలు షేక్ హసీనా బేగం, జాయింట్ సెక్రటరీ కంకణంపాటి వెంకటేశ్వర్లు, హెడ్ కానిస్టేబుళ్లు ఎం.శీను, డి.విజయభాస్కర్, కే చిన్న రాఘవ, ట్రస్ట్ సభ్యులు పాల్గొన్నారు.

నూతన ఓటు హక్కుకు దరఖాస్తు చేసుకోవాలి



విద్యార్థులతో మాట్లాడుతున్న ఎంపీడీఓ సురేష్ బాబు

సంతనూతలపాడు: 18 సంవత్సరాలు నిండిన ప్రతిఒక్కరూ నూతన ఓటు హక్కు నమోదుకు దరఖాస్తు దాఖలు చేయాలని సంతనూతలపాడు ఎంపీడీవో డి.సురేష్ బాబు కోరారు. పేర్నమిట్టలోని శ్రీ ప్రతిభ జూనియర్ కళాశాల, సరస్వతి జూనియర్ కళాశాల, ఎండ్లూరు డొంక వద్ద గల మహిళా ప్రాంగణంలో బుధవారం నూతన ఓటు నమోదు ప్రక్రియపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించి ప్రసంగించారు. ఈ నెల 23, 24 తేదీల్లో అన్ని బూత్‌లలో నూతన ఓటు నమోదు, చేర్పులు, సవరణలపై ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఎంపీడీవో వెల్లడించారు. అవసరమైన వారంతా సద్వినియోగం చేసుకోవాలని కోరారు. విద్యార్థులకు పలు అంశాల గురించి ఒంగోలు తాలూకా పోలీస్‌స్టేషన్ సబ్ ఇన్‌స్పెక్టర్ అనిత వివరించారు. కార్యక్రమంలో ఎంఈఓ డి.వెంకారెడ్డి, సంతనూతలపాడు రెవెన్యూ కార్యాలయ ఎన్నికల ప్రతినిధి ఎంవీ రమణ, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కూటమి సోషల్ మీడియాపై ఫిర్యాదు

- చీమకుర్తి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసిన వైఎస్సార్ సీపీ నాయకులు



పోలీసులకు ఫిర్యాదు చేస్తున్న జెడ్పీటీసీ, ఎంపీపీ, కౌన్సిలర్లు, నాయకులు

చీమకుర్తి: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఐదు నెలల్లో టీడీపీ, జనసేన పార్టీలకు చెందిన సోషల్ మీడియా కార్యకర్తల అరాచకానికి అంతులేకుండా పోయిందని చీమకుర్తి జెడ్పీటీసీ సభ్యుడు వేమా శ్రీనివాసరావు ఆగ్రహం వ్యక్తం చేశారు. కూటమి ప్రభుత్వానికి చెందిన సోషల్ మీడియా కార్యకర్తల ఆగడాలపై బుధవారం చీమకుర్తి పోలీస్ స్టేషన్‌లో వైఎస్సార్ సీపీ నాయకులతో కలిసి ఫిర్యాదు చేశారు. వైఎస్సార్ సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, పార్టీ జిల్లా అధ్యక్షుడు, దర్శి ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాదరెడ్డి ఆదేశాల మేరకు వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ పమిడి వెంకటేశ్వర్లు, పట్టణ కన్వీనర్ క్రిష్టిపాటి శేఖరరెడ్డి, ఎంపీపీ యద్దనపూడి శ్రీనివాసరావు, తదితర నాయకులతో కలిసి చీమకుర్తి పోలీస్ స్టేషన్‌లో వేమా శ్రీనివాసరావు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వానికి చెందిన సోషల్ మీడియా కార్యకర్తలు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, వారి కుటుంబ సభ్యులపై అసభ్యకరంగా పోస్టులు పెట్టారని, వాటిని ఆధారాలతో సహా పోలీసులకు ఇచ్చామని, నిందితులను తక్షణమే అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపరచాలని డిమాండ్ చేశారు. అనంతరం పోలీస్ స్టేషన్ పక్కనే ఉన్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి ఫిర్యాదుతో కూడిన వినతిపత్రాన్ని అందించి నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులతో పాటు కౌన్సిలర్లు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, కార్యకర్తలు పాల్గొన్నారు.

జగన్‌ను కలిసిన వైఎస్సార్ సీపీ నాయకుడు



వైఎస్ జగన్‌తో జయకుమార్, పక్కన జూపూడి

నాగులుప్పలపాడు: మండలంలోని ఈదుమూడి గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ నాయకుడు కావూరి జయకుమార్ బుధవారం తాడేపల్లిలో పార్టీ అధికార ప్రతినిధి జూపూడి ప్రభాకర్‌తో పాటు ఆ పార్టీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని కలిశారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాల వలన క్షేత్రస్థాయిలో ప్రజలు పడుతున్న ఇబ్బందులను జగన్ దృష్టికి తీసుకెళ్లారు. ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాటాల ద్వారా ప్రజలకు మంచి చేయాలని జగనన్న సూచించారని జయకుమార్ తెలిపారు.

ప్రజలకు ఇబ్బంది లేకుండా పైప్‌లైన్ నిర్మించాలి



బీపీసీఎల్ పైప్‌లైన్ నిర్మాణంపై సమావేశం నిర్వహిస్తున్న జేసీ

- జాయింట్ కలెక్టర్ గోపాలకృష్ణ

ఒంగోలు అర్బన్: ప్రజలకు ఇబ్బంది లేకుండా బీపీసీఎల్ పైపులైన్ నిర్మాణం చేపట్టాలని జాయింట్ కలెక్టర్ గోపాలకృష్ణ సంబంధిత కంపెనీ ప్రతినిధులకు సూచించారు. ప్రకాశంభవనంలో ఎస్ఎపాడు ఎమ్మెల్యే విజయ్‌కుమార్‌తో కలిసి బీపీసీఎల్ పైపులైను నిర్మాణ పనులకు ఉన్న అవకాశాలపై బుధవారం సమీక్షా సమావేవం నిర్వహించారు. పేర్నమిట్ట చెరువులో నుంచి పైపులైన్ ప్రతిపాదించడంపై స్థానికులు ఆందోళన వ్యక్తం చేసిన నేపథ్యంలో స్థానికులతో పాటు కంపెనీ ప్రతినిధులతో చర్చించారు. పేర్నమిట్ట చెరువు ఎంతో చరిత్ర కలిగిందని,. అంతేకాకుండా 25 వేల మందికి తాగునీటిని అందిస్తోందన్నారు. అలాంటి చెరువు నుంచి పైపులైన్ వేయడం సరికాదని స్థానికులు అభ్యంతరం వ్యక్తం చేసారు. దీంతో పాటు చెరువు చుట్టూ పక్కల ప్రాంతాలను ప్రభుత్వం నివాస స్థలాలుగా గుర్తించిందని తెలిపారు. ఈ ప్రాంతం నుంచి పైపులైన్ వేయడం వల్ల పర్యావరణ పరంగా సరికాదన్నారు. స్పందించిన జాయింట్ కలెక్టర్ స్థానిక ప్రజల అభ్యంతరాలు, భవిష్యత్ అవసరాలతో పాటు చట్ట నిబంధనలు పరిగణలోకి తీసుకుని చెరువులో నుంచి పైపులైన్ వేసే ప్రతిపాదన ఉపసంహరించుకోవాలని బీపీసీఎల్ ప్రతినిధులకు సూచించారు. చెరువును తాకకుండా ప్రత్నామ్నాయ మార్గం ద్వారా పైపులైన్ వేసేలా పరిశీలించాలన్నారు. అందుకు తిరిగి రీ సర్వే చేయాలన్నారు. సమావేశంలో ఒంగోలు ఆర్‌డీఓ లక్ష్మీప్రసన్న, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ శ్రీదేవి, ఎస్ఎన్‌పాడు తహసీల్దార్ ఆదిలక్ష్మి, పేర్నమిట్ట చెరువు సంరక్షణ సమితి ప్రతినిధులు, రైతులు పాల్గొన్నారు.

చంద్రబాబు అబద్ధాల పుట్ట

- సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు గుజ్జుల ఈశ్వరయ్య



మాట్లాడుతున్న సీపీఐ రాష్ట్ర నాయకుడు గుజ్జుల ఈశ్వరయ్య

ఒంగోలు టౌన్: చంద్రబాబు అబద్ధాల పుట్ట అని, ప్రజలకు ఇచ్చిన ఎన్నికల హామీలు అమలు చేయడంలో విఫలమయ్యారని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు గుజ్జుల ఈశ్వరయ్య అన్నారు. ఎన్నికలకు ముందు వలంటీర్లకు రూ.10 వేల వేతనం ఇస్తానని చెప్పి ఇప్పుడు వలంటీర్ల వ్యవస్థే లేదని బుకాయిస్తున్నారని మండిపడ్డారు. ఎన్నికలకు ముందు స్మార్ట్ మీటర్లు రైతులు ప్రజల పాలిట ఉరితాళ్లని చెప్పిన చంద్రబాబుకు ఇప్పుడవి పూల దండలుగా ఎలా మారాయో చెప్పాలని నిలదీశారు. బుధవారం మల్లయ్య లింగం భవనంలో నిర్వహించిన నగర సమితి సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన ప్రసంగిస్తూ.. సూపర్ సిక్స్ పథకాలు ఏమయ్యాయో చెప్పాలని ప్రశ్నించారు. అమ్మకు వందనం పథకానికి నిధులు కేటాయించలేదని, నాన్నకు ఇంధనం పథకం మాత్రం యథేచ్ఛగా అమలవుతోందన్నారు. ప్రజలపై విద్యుత్ భారం మోపనని చెప్పిన చంద్రబాబు ఇప్పుడు గతంలో ఎన్నడూ లేని విధంగా వేల కోట్ల రుపాయల భారాన్ని మోపేందుకు సన్నాహాలు చేస్తున్నారని విమర్శించారు. వెలుగొండకు కేటాయించిన నిదులు సిబ్బంది జీతాలకు కూడా సరిపోవని, ఇదే విధంగా నిధులు కేటాయిస్తే మరో 20 ఏళ్లకు కూడా ప్రాజెక్టు పూర్తవదన్నారు. అధికారాన్ని నిలబెట్టుకునేందుకు తెలుగు దేశం లాంటి ప్రాంతీయ పార్టీలతో బీజేపీ పొత్తు పెట్టుకుంటుందని, అధికారంలోకి వచ్చిన తరువాత అదే ప్రాంతీయ పార్టీలను కబళించి వేస్తుందన్నారు. సమావేశంలో జిల్లా కార్యదర్శి ఎంఎల్ నారాయణ, పార్టీ సీనియర్ నాయకులు సయ్యద్ సర్దార్, కొత్తకోట వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

30 లోపల పరీక్ష ఫీజు చెల్లించాలి

ఒంగోలు సిటీ: టెక్నికల్ సర్టిఫికెట్ కోర్సు జనవరి 2025 నకు సంబంధించి (లోయర్, హైయర్) డ్రాయింగ్, హ్యాండ్‌లూమ్, టైలరింగ్, ఎంబ్రాయిడింగ్ లకు సంబంధించి ఆన్‌లైన్ ద్వారా డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.బీఎస్ఈ.ఏపీ.జీవోవీ.ఇన్ వెబ్‌సైట్ ద్వారా ఎలాంటి అపరాధ రుసుం లేకుండా ఈ నెల 30 వ తేదీ లోపల పరీక్ష ఫీజు చెల్లించాలని డీఈఓ అత్తోట కిరణ్‌కుమార్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. రూ.50 అపరాధ రుసుంతో డిసెంబరు 10వ తేదీ వరకు, రూ.75 అపరాధ రుసుంతో డిసెంబరు 13వ తేదీ వరకు చెల్లించాలన్నారు. డ్రాయింగ్ (లోయర్‌గ్రేడ్)కు రూ.100, డ్రాయింగ్ (హైయర్ గ్రేడ్) రూ.150, హ్యాండ్‌లూమ్ అండ్ వీవింగ్ (లోయర్‌గ్రేడ్) రూ.150, హ్యాండ్‌లూమ్ అండ్ వీవింగ్ (హైయర్‌గ్రేడ్) రూ.200, టైలరింగ్ (లోయర్‌గ్రేడ్) రూ.150, టైలరింగ్ (హైయర్ గ్రేడ్) రూ.200 చెల్లించాలన్నారు. పూర్తి చేసిన దరఖాస్తులను జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయం ఒంగోలులో సమర్పించాలని కోరారు.

26 లోపు పరీక్ష ఫీజు చెల్లించాలి

ఒంగోలు సిటీ: సర్టిఫికెట్ కోర్సు ఇన్ లైబ్రరీ అండ్ ఇన్ఫర్మేషన్ సైన్స్ (సి.ఎల్.ఐ.ఎస్సీ.-70 వ బ్యాచ్) డిసెంబరు-2024కు ఎటువంటి అపరాధ రుసుము లేకుండా రూ.150 ఈ నెల 26 వ తేదీ లోపల సంబంధిత కళాశాలల ప్రిన్సిపాళ్లకు చెల్లించాలని డీఈఓ అత్తోట కిరణ్‌కుమార్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఫెయిలైన విద్యార్థులకు మూడు సబ్జెక్టుల పైన ఉంటే రూ.150, మూడు సబ్జెక్టులకు లోపల ఫెయిలైన విద్యార్థులకు రూ.100లు చెల్లించాలని కోరారు. సదరు పరీక్ష ఫీజును కళాశాల ప్రిన్సిపాల్స్ సీ.ఎఫ్.ఎం.ఎస్ ద్వారా మాత్రమే చెల్లించాలని కోరారు.

ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి



ఆర్టీసీ డిపో వద్ద ధర్నా చేస్తున్న ఫెడరేషన్ నాయకులు

ఒంగోలు టౌన్: ఏపీ పీటీసీ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ ప్రకాశం రీజియన్ ఆధ్వర్యంలో ఆర్టీసీ డిపో వద్ద . బుధవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఫెడరేషన్ రాష్ట్ర కార్యదర్శి ఎం అయ్యపరెడ్డి మాట్లాడుతూ జీఓ నంబర్ 70, 71లను సమూలంగా మార్చివేయాలని, టికెట్ తీసుకునే బాధ్యత ప్రయాణికుడికే ఉండాలని చెప్పారు. అన్నీ కేటగిరిల్లో పదోన్నతులు కల్పించాలని, ఖాళీగా ఉన్న పోస్టులను వెంటనే భర్తీ చేయాలని రీజియన్ ప్రధాన కార్యదర్శి పి. శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. కారుణ్య నియామకాలను చేపట్టాలని, ఉద్యోగుల వారసులకు ఉద్యోగాలు ఇవ్వాలని, కొత్తగా రిక్రూట్‌మెంట్ చేపట్టాలని కోరారు. సీఐటీయూ జిల్లా కార్యదర్శి గంటెనపల్లి శ్రీనివాసరావు మాట్లాడుతూ గ్యారేజీ కార్మికులకు పనిచేసే వాతావరణం కల్పించాలని డిమాండ్ చేశారు. 12వ పీఆర్సీ అమలు చేయాలని, బకాయి పడిన 3 లీవ్ ఎన్‌కాష్‌మెంట్ విడుదల చేయాలని, పెండింగ్‌లో ఉన్న డీఏలను విడుదల చేయాలన్నారు. అద్దె బస్సు కార్మికులకు ఔట్‌సోర్సింగ్ కార్మికులకు కాలాస్ డ్రైవర్లకు మినిమం టైం స్కేల్ అమలు చేయాలని కోరారు. కార్యక్రమంలో అల్లడి సుబ్బారావు, హరిబాబు, డీకేరావు పాల్గొన్నారు.

విజయంతో తిరిగి రావాలి



యూనివర్శిటీ జట్టుకు ఎంపికైన కబడ్డీ క్రీడాకారిణులు

ఒంగోలు: తమిళనాడు రాష్ట్రంలోని కారైకుడిలో ఉన్న అలగప్పా యూనివర్సిటీలో ఈ నెల 29 నుంచి డిసెంబర్ 3వ తేదీ వరకు జరగబోయే అంతర్ యూనివర్సిటీ మహిళల కబడ్డీ పోటీల్లో పాల్గొనే ఆంధ్రకేసరి యూనివర్సిటీకి చెందిన 12 మంది క్రీడాకారుల జట్టు విజయంతో తిరిగి రావాలని ఏకేయూ వీసీ ప్రొఫెసర్ డీవీఆర్ మూర్తి ఆకాంక్షించారు. ఆంధ్రకేసరి యూనివర్సిటీ ప్రాంగణంలో అంతర కళాశాలల మహిళల కబడ్డీ పోటీలు ముగియడంతో బుధవారం ఉదయం ఆంధ్రకేసరి యూనివర్సిటీ తరఫున అంతర విశ్వవిద్యాలయాల పోటీల్లో పాల్గొనే మహిళా కబడ్డీ జట్టును ప్రకటించారు. ఈ సందర్భంగా వీసీ మూర్తి మాట్లాడుతూ క్రీడాకారులు ఒత్తిడికి లోనుకాకుండా హుందాగా ఆటను ప్రదర్శించాలని, తద్వారా విజయాన్ని చేరుకోవచ్చని తెలిపారు. ఏకేయూ సీడీసీ డీన్ ప్రొఫెసర్ జి.సోమశేఖర, ఫిజికల్ ఎడ్యుకేషన్ విభాగం డిప్యూటీ డైరెక్టర్ దేవీవరప్రసాద్, సెలక్షన్ కమిటీ సభ్యులు, పాల్గొన్నారు.

శిశువుకు మెరుగైన వైద్యం అందించాలి

- సీడబ్ల్యూసీ సభ్యురాలు డి.నీలిమ



శిశువు ఆరోగ్య పరిస్థితిని తెలుసుకుంటున్న సీడబ్ల్యూసీ సభ్యురాలు నీలిమ

ఒంగోలు సిటీ: ఒంగోలు జీజీహెచ్‌లో చికిత్స పొందుతున్న ఆడ శిశువును సీడబ్ల్యూసీ సభ్యురాలు డి.నీలిమ బుధవారం సందర్శించారు. మెరుగైన వైద్యం అందించాలని వైద్య సిబ్బందిని ఆదేశించారు. ఈ సందర్భంగా జిల్లా సమగ్ర బాలల పరిరక్షణ అధికారి పి.దినేష్‌కుమార్ మాట్లాడుతూ సంతమాగులూరు, వయా బల్లికురవ, అద్దంకి మార్గంలో బస్టాండ్ సమీపంలో ఉన్న జొన్న పొలంలో పసిబిడ్డ ఏడుపులు రోడ్డున వెళ్లే వారికి వినిపంచినట్లు తెలిపారు. పరిశీలించగా గంటల క్రితమే పురుడు పోసుకున్న ఆడ శిశువు ఏడుస్తున్నట్లు గుర్తించినట్లు చెప్పారు. ఎవరో జొన్న పొలంలో శిశువును వదిలి వెళ్లగా, స్థానిక అంగన్‌వాడీ, మహిళా పోలీసు సిబ్బంది ద్వారా స్థానిక పీహెచ్‌సీలో ప్రాథమిక చికిత్స చేయించినట్లు తెలిపారు. ప్రస్తుతం జీజీహెచ్‌లో మెరుగైన వైద్యం అందిస్తున్నట్లు తెలిపారు.

అందరికీ పోస్టల్ బ్యాంకింగ్ సర్వీసు

- ఒంగోలు పోస్టల్ ఇన్‌స్పెక్టర్ ప్రవీణ్‌రాజ్



మాట్లాడుతున్న ఒంగోలు పోస్టల్ ఇన్‌స్పెక్టర్ ప్రవీణ్‌రాజ్

మద్దిపాడు: ప్రతిఒక్కరికీ ఇండియన్ పోస్ట్ పేమెంట్ బ్యాంక్ సర్వీసు అందించడమే లక్ష్యంగా తపాలా శాఖ అనుసంధానంగా ఇండియన్ పోస్ట్ పేమెంట్ బ్యాంకును భారత ప్రభుత్వం ఏర్పాటు చేసిందని ఒంగోలు పోస్టల్ ఇన్‌స్పెక్టర్ ప్రవీణ్‌రాజ్ తెలిపారు. ఈ బ్యాంకు ద్వారా ప్రతి ఒక్కరికీ అతి తక్కువ సర్వీస్ చార్జీలతో బ్యాంకింగ్ సౌకర్యం కల్పిస్తున్నట్లు చెప్పారు. బుధవారం మద్దిపాడులో కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్లకు నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. ఇండియన్ పోస్టల్ పేమెంట్ బ్యాంక్ పాత్ర భారత దేశంలో అతి ముఖ్యమైనదని, దేశంలో ఏ పోస్ట్ బ్యాంకు నుంచైనా డబ్బు డ్రా చేసుకోవచ్చని తెలిపారు. అందుకు ఎటువంటి చార్జీలు వసూలు చేయరన్నారు. ఇప్పటివరకు దేశంలో 1,50,000 పోస్టాఫీసుల్లో ఈ సేవలు ప్రజలకు అందుబాటులో ఉన్నాయన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల ప్రకారం మన రాష్ట్రంలో 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరికీ బ్యాంక్ అకౌంట్ ఉండాలని, ఆ బ్యాంక్ అకౌంటుకు ఎన్పీసీఐ లింక్ చేసుకుని ఉండాలని అన్నారు. లింక్ చేసుకోవడం కోసం ఐపీపీబీలో కేవలం రూ.200తో ఖాతా ఓపెన్ చేసుకోవచ్చని తెలిపారు. మిగతా బ్యాంకులతో పోలిస్తే పోస్టల్ బ్యాంకులో అకౌంట్ ఓపెన్ చేసుకోవడం వలన అనేక లాభాలు ఉన్నాయని వివరించారు. ముందుగా ఎంపీడీవో వి.జ్యోతి మాట్లాడుతూ పంచాయతీల వారీగా గ్రామ కార్యదర్శులు ఎన్పీసీఐ లింక్ ఎంతవరకు చేశారని సమీక్షించారు. కార్యక్రమంలో యువ పీఆర్ డి.రఘుబాబు, ఏపీవో ధనుంజయ, టెక్నికల్ ఇంజినీర్ కిషోర్, పంచాయతీ కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడిగా పవన్ కళ్యాణ్



పవన్ కళ్యాణ్

ఒంగోలు టౌన్: అఖిల భారత విద్యార్థి సమాఖ్య (ఏఐఎస్ఎఫ్) జిల్లా అధ్యక్షుడిగా సీహెచ్.పవన్ కళ్యాణ్, కార్యదర్శిగా సన్నిబోయిన రామాంజనేయులును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షులుగా స్టాలిన్, ప్రజ్వల్, శ్రావణి, సుభాన్ బీ, సహాయ కార్యదర్శిగా సురేంద్ర, సురేష్, బెంజిమెన్, సబిహా, కోశాధికారిగా బి.రామాంజనేయులు, మహిళా కన్వీనర్‌గా షేక్ సబిహాలను ఎన్నుకున్నారు. నూతన కమిటీని పలువురు పార్టీ నాయకులు, విద్యార్థి సంఘ నాయకులు అభినందించారు.

విద్యార్థులను ఉన్నతంగా తీర్చిదిద్దాలి



ర్యాలీ నిర్వహిస్తున్న ఎంపీడీవో, తహసీల్దార్, ఎంఈఓలు

మద్దిపాడు: విద్యార్థులను ఉన్నత పౌరులుగా తీర్చిదిద్దాలని ఎంపీడీవో వి.జ్యోతి అన్నారు. బుధవారం బంగారు బాలోత్సవం కార్యక్రమం ముగింపు సందర్భంగా మద్దిపాడు కడియాల యానాదయ్య ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. మండల స్థాయిలో నిర్వహించిన వ్యాసరచన, వక్తృత్వం, చిత్రలేఖనం, తదితర పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందించారు. అనంతరం పాఠశాల నుంచి సెంటర్ వరకు విద్యార్థులతో ర్యాలీ, మానవహారం నిర్మించారు. కార్యక్రమంలో తహసీల్దార్ సుజన్ కుమార్, ఎంఈఓలు ఎంవీఆర్ ఆంజనేయులు, ఎం.శ్రీనివాసరావు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు పెద్దిరెడ్డి కోటిరెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఉపకార వేతనాలకు నమోదు చేసుకోవాలి

ఒంగోలు వన్‌టౌన్: డిగ్రీ, పీజీ విద్యనభ్యసిస్తున్న ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఈబీసీ, మైనార్టీ లకు చెందిన విద్యార్థులు ఉపకార వేతనాలు పొందేందుకు కళాశాలలో జ్ఞానభూమి వెబ్‌సైట్‌లో నమోదు చేసుకోవాలని జిల్లా షెడ్యూల్ కులాలు, సంక్షేమ, సాధికారిత అధికారి, సాంఘిక సంక్షేమ శాఖ నోడల్ అధికారి ఎస్ లక్ష్మానాయక్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. 2024-24 సంవత్సరానికి సంబంధించి నూతన, రెన్యూవల్స్ ఉపకార వేతనాలకు రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. నవంబర్ 30వ తేదీలోపు విద్యార్థులు రిజిస్ట్రేషన్‌లు చేసుకోవాలన్నారు. ఉపకార వేతనాలకు దరఖాస్తులు చేసుకున్న వారు. వారి పరిధిలోని గ్రామ సచివాలయాల్లో ఫైవ్ స్టెప్ వెరిఫికేషన్ చేయించుకోవాలన్నారు.

బెల్టు షాపు నిర్వాహకుడు అరెస్టు

- 19 మద్యం బాటిళ్లు స్వాధీనం



పట్టుబడిన మద్యం బాటిళ్లతో ఎస్సై

నాగులుప్పలపాడు: బెల్టు షాపు నిర్వాహకుడిని అరెస్టు చేసి అతని వద్ద నుంచి 19 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు నాగులుప్పలపాడు ఎస్సై శ్రీకాంత్ తెలిపారు. మండలంలోని కనపర్తి గ్రామంలో అక్రమంగా మద్యం బాటిళ్లు నిల్వ చేసి అమ్మకాలు జరుపుతున్నట్లు సమాచారం అందడంతో రాజనీడి రాముడు దుకాణంపై దాడి చేశామన్నారు. దుకాణంలో మద్యం బాటిళ్లు దొరకడంతో కేసు నమోదు చేసి అతన్ని అరెస్టు చేసి కోర్టులో ప్రవేశపెట్టినట్లు చెప్పారు.

పోక్సో కేసులో నిందితునికి 20 ఏళ్ల జైలు

ఒంగోలు: పోక్సో కేసులో నిందితునికి 20 ఏళ్ల జైలు శిక్ష విధిస్తూ పోక్సో కోర్టు, 7వ అదనపు జిల్లా న్యాయమూర్తి టి.రాజా వెంకటాద్రి బుధవారం తీర్పునిచ్చారు. ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం చినగంజాం మండలం సంతరావూరుకు చెందిన బాలికపై అదే గ్రామానికి చెందిన దుడ్డు చిన్నబ్బాయి లైంగిక దాడికి పాల్పడ్డాడు. దీనిపై అప్పట్లో చినగంజాం పోలీస్ స్టేషన్లో పోక్సో కేసు నమోదైంది. దీనిపై అప్పటి డీఎస్పీ విచారణ జరిపి కోర్టులో చార్జిషీటు దాఖలు చేశారు. వాద ప్రతివాదనల అనంతరం ప్రాసిక్యూషన్ వాదనతో ఏకీభవించిన న్యాయమూర్తి నిందితునికి 20 ఏళ్ల జైలు శిక్ష, రూ.10 వేలు జరిమానా విధిస్తూ తీర్పునిచ్చారు. మరో వైపు బాధితురాలికి రూ.7 లక్షలు పరిహారం చెల్లించాలని ప్రభుత్వాన్ని ఆదేశించారు.